ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు
మంగళవారం 20 ఫిబ్రవరి 2024 | 5





కల్యాణోత్సవాన్ని తిలకిస్తున్న మంత్రి వేణు, కలెక్టర్, ఎస్పీ



కల్యాణ తంతును నిర్వహిస్తున్న పండితులు



కల్యాణ వేదికపై కొలువైన స్వామి, అమ్మవార్లు

బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంతర్వేదిలో లక్ష్మీనరసింహుని దివ్య కల్యాణం కన్నుల పండువగా జరిగింది..వేలాది మంది భక్తుల సమక్షంలో ఆ దేవదేవుని వివాహ మహోత్సవం శోభాయమానంగా సాగింది. సోమవారం అర్ధరాత్రి 12:29 గంటలకు ఆరుద్ర నక్షత్రయుక్త వృశ్చికలగ్న పుష్కరాంశమందు శ్రీలక్ష్మీనరసింహస్వామివారు ఉభయ దేవేరులైన భూదేవి, శ్రీదేవిని పరిణయమాడారు. వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ కల్యాణ తంతు వైభవోపేతంగా సాగింది.

వార్తలు 7లో

కల్యాణ వైభోగమే



స్వామివారి కల్యాణ కొబ్బరిబొండాలు



కల్యాణోత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు



స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పిస్తున్న అధికారులు



ఆరుబయట కూర్చున్న యాత్రికులు

వేలాది మంది భక్తుల పుణ్యస్నానాలు

ఆలయ ప్రాంగణంలోనే రాత్రి బస

అంతర్వేది, ఫిబ్రవరి 19: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా రథసప్తమి రోజు మొదలుకుని ఈ తొమ్మిది రోజులు వేకువజామున భక్తులు సముద్రస్నానాలు ఆచరించడం ఆనవాయితీగా వస్తోంది. దీంతో పవిత్ర సాగరసంగమంగా పేరొందిన అంతర్వేది తీరం భక్తులతో కిటకిటలాడుతుంది. స్నానాలు ఆచరించిన భక్తులు స్వామివారిని దర్శించుకునేందుకు ఆలయం వద్ద క్యూలైన్లలో బారులు తీరారు. దర్శనం అనంతరం భక్తులు కల్యాణ ఘడియల కోసం ఎదురుచూశారు. కల్యాణం తిలకించిన భక్తులు భక్తిపారవశ్యంతో పులకించారు. అంతర్వేదిలో బ్రహ్మదేవునిచే ప్రతిష్ఠింపబడిన క్షేత్రపాలకుడు నీలకంఠేశ్వరుడుతో పాటు క్షేత్ర సంరక్షకుడు అంజనేయస్వామి, స్వామివారి సోదరి గుర్రా లక్కమ్మ, శ్రీవశిష్ఠ ఆశ్రమ ఆలయాల్లో భక్తులు పూజలు నిర్వహించారు. కృష్ణా జిల్లా నుంచి రెండు రోజుల ముందే వచ్చిన భక్తులు కల్యాణ మండపం సమీపంలో నిద్రచేస్తూ స్వామివారి కల్యాణాన్ని తిలకించి సముద్ర పుణ్యస్నానాలు చేసి స్వామిని దర్శించుకుని వెళ్లడం ఆనవాయితీగా వస్తోంది.



విద్యుత్ దీపాల కాంతులతో అంతర్వేది

టిక్కెట్ల విక్రయాలు

అంతర్వేది, ఫిబ్రవరి 19: రాష్ట్రంలోనే ఆరు బయట జరిగే కల్యాణోత్సవాల్లో అంతర్వేది పుణ్యక్షేత్రమైన శ్రీలక్ష్మీనరసింహస్వామివారి దివ్య తిరు కల్యాణ మహోత్సవం వైభవంగా జరుగుతుంది. ఉభయ రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి కూడా వచ్చే భక్తులు రెండు రోజుల ముందు నుంచే కల్యాణాన్ని వీక్షించేందుకు టిక్కెట్ల కోసం క్యూ కడతారు. ఆలయం ఎదురుగా ఉన్న కల్యాణ షెడ్డులో సుమారు వేల మంది భక్తులు కల్యాణాన్ని తిలకిస్తారు. రెవెన్యూ, దేవదాయ శాఖల కనుసన్నల్లో జరిగే స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని తిలకించేందుకు ఆలయం వద్ద నున్న కౌంటర్‌లో రూ.200 చొప్పున కల్యాణం టిక్కెట్లను విక్రయించారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఎల్ఈడీ స్క్రీన్లపై కల్యాణాన్ని వీక్షించారు. 1200 మంది మండపంలో స్వామివారి కల్యాణాన్ని ప్రత్యక్షంగా చూడడానికి పది ఎల్ఈడీ స్క్రీన్లను ఏర్పాటు చేశారు.

కృష్ణమ్మకు గజమాల

అంతర్వేది ఆలయానికి అగ్నికుల క్షత్రియులు, కొపనాతి కృష్ణమ్మ వారసులు భారీ ర్యాలీగా ఆలయానికి చేరుకున్నారు. అనంతరం ఆలయ నిర్మాత కొపనాతి కృష్ణమ్మ విగ్రహానికి భారీ గజమాల వేశారు. కార్యక్రమంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అగ్నికుల క్షత్రియులు, భక్తులు పాల్గొన్నారు.

స్వచ్ఛంద సంస్థల సేవలు

అంతర్వేది ఉత్సవాల్లో సఖినేటిపల్లి, మామిడికుదురు, మలికిపురం మండలాలకు చెందిన సుమారు 200 మందికి పైగా స్కౌట్ విద్యార్థులు ఉత్సవాల్లో పాల్గొని సేవలు చేశారు. భజరంగదళ్, విశ్వ హిందూ పరిషత్, సత్యసాయి ట్రస్టు సభ్యులు ఉత్సవాల్లో సేవలు చేసేందుకు ముందుకు వచ్చారు. వైద్య సదుపాయం, తాగునీటి సరఫరా, పారిశుధ్యంపై అధికారులు దృష్టి సారించి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

నేడు స్వామివారి రథోత్సవం

- అంతర్వేదిలో ఘనంగా ఏర్పాట్లు
- హాజరుకానున్న వేలాది మంది భక్తులు
- పటిష్ట బందోబస్తు

7లో

స్వామివారికి బంగారు ఆభరణాలు

కల్యాణోత్సవం సందర్భంగా అలంకరణ

7లో

అర్జీలన్నింటికీ పరిష్కార మార్గాలు చూపాలి: కలెక్టర్



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ హిమాన్షుశుక్లా

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 19: అర్జీదారుడు సంతృప్తి చెందే స్థాయిలో పరిష్కార మార్గాలు చూపాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా సూచించారు. క్షేత్రస్థాయిలో అర్జీలను విచారించి సమస్యలు పరిష్కరించాలన్నారు. కలెక్టరేట్ గోదావరి భవన్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక స్పందనలో కలెక్టర్ శుక్లాతో పాటు జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు, ఐపీఎస్ శిక్షణ పొందుతున్న రోహిత్‌కుమార్ చౌదరితో కలిసి అర్జీలు స్వీకరించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చినవారు 229 అర్జీలను అందజేశారు. కార్యక్రమంలో డ్వామా పీడీ ఎస్.మధుసూదన్, నోడల్ అధికారి కె.భీమేశ్వరరావు, డీపీవో వి.కృష్ణకుమారి, సాంఘిక సంక్షేమ సాధికారిత అధికారిణి పి.జ్యోతిలక్ష్మీదేవి, డీఎస్‌వో ఎ.పాపారావు, జిల్లా వ్యవసాయాధికారి వి.బోసుబాబు తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి కష్టాలు



అల్లవరం మండలం తుమ్మలపల్లి కాలువలో ఇంజన్ల సాయంతో సాగు

- దాళ్వాసాగులో సాగునీటికి కష్టాలు
- చేలకు నీరందక రైతుల ఇబ్బందులు
- శివారు ప్రాంతాల్లో పరిస్థితి మరింత దారుణం
- అధికారులు పట్టించుకోవడం లేదని రైతుల ఆరోపణ

సాగునీరందక అన్నదాతలు అల్లాడిపోతున్నారు..దాళ్వా సాగులో వారి పరిస్థితి దయనీయంగా మారింది. ప్రతిఏటా ఇదే పరిస్థితి నెలకొన్నా ఈ సారి మరింత ఇబ్బందికర పరిస్థితులు ఏర్పాడ్డాయి. సాగునీటి సమస్యలు రైతులను తీవ్రంగా వేధిస్తున్నాయి. పంట కాల్వలు అధ్వానంగా మారడంతో ఈ పరిస్థితి తలెత్తింది.

అల్లవరం, ఫిబ్రవరి 19: ప్రతి ఏటా రైతులకు దాళ్వా సాగులో సాగునీటి కష్టాలు తప్పడంలేదు. అల్లవరం మండలంలో పంట కాలువల ద్వారా శివారు ప్రాంతాల్లో వరి చేలకు సాగునీరందక రైతులు గగ్గోలు పెడుతున్నారు. పంట కాలువలో కొద్దిపాటి నీటిని ఇంజన్ల ద్వారా తోడుకుని దాళ్వా వరి చేలకు ఊపిరిపోస్తున్నారు. అల్లవరం మండల పరిధిలోని బెండాకాలువ, తుమ్మలపల్లి కాలువ, తాడికోన, సామంతకుర్రు కాలువ ద్వారా పూర్తిస్థాయిలో సాగునీరందక రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇరిగేషన్ అధికారులు శివారు ప్రాంతాల సాగునీటి సమస్యలు పట్టించుకోవడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. అల్లవరం మండలంలో 4300 ఎకరాలలో దాళ్వా సాగు జరుగుతోంది. వంతుల వారీ సరిగ్గా పాటించక రైతులు సాగునీటి కష్టాలను ఎదుర్కొంటున్నారు. ఇరిగేషన్ అధికారుల దృష్టికి సాగునీటి సమస్యలను తీసుకువెళ్లి సాగునీరు అందేలా చర్యలు తీసుకుంటామని ఏవో ఎన్‌వీవీ సత్యనారాయణ తెలిపారు. రైతుల సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని చెప్పారు.

వైభవంగా జనార్దనస్వామి కల్యాణోత్సవం



స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

ఆలమూరు, ఫిబ్రవరి 19: ఆలమూరులో వేంచేసి ఉన్న శ్రీదేవి భూదేవి సమేత నవజనార్ధనస్వామి కల్యాణోత్సవం సోమవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. కల్యాణోత్సవం సందర్భంగా ఉదయం స్వామివారికి అర్చన, అమ్మవార్లకు కుంకుమ పూజ, అర్జితసేవలను ఆలయ అర్చకులు అంగర రంగాచార్యులు, అంగర సూర్యభగవాన్‌లతో పాటు పలువురు పండితులు ఘనంగా నిర్వహించారు. సాయంత్రం స్వామివారిని పెండ్లి కుమారుడిగా గరుడ వాహనంపై సన్నాయి మేళాలతో భారీ బాణసంచా కాల్పులతో ఊరేగింపు నిర్వహించారు. శ్రీదేవి భూదేవిలతో పాటు జనార్ధనస్వామి వార్లను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కల్యాణ వేదికపై వేద పండితులు శాస్త్రోక్తంగా కల్యాణ కార్యక్రమాన్ని జరిపించారు. స్వామివారి కల్యాణోత్సవాన్ని తిలకించడానికి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేశారు. కల్యాణోత్సవ ఏర్పాట్లను ఆలయ ట్రస్టు బోర్డు ఛైర్మన్ వనుం సూరిబాబు, కార్యనిర్వహణాధికారి సీహెచ్ సత్యనారాయణ పర్యవేక్షించారు.

ఖర్చు చేయించి..చేతులెత్తేశారు..



ఆందోళన నిర్వహిస్తున్న ఇన్‌స్ట్రక్టర్లు

2021 ఆగస్టు 16న పి.గన్నవరంలో నాడు-నేడు పథకం కింద చేపట్టిన పాఠశాల అభివృద్ధి పనులను ప్రారంభించేందుకు సీఎం జగన్ వస్తున్నారని, తమతో ఎన్నో పనులు చేయించుకుని ఇంత వరకు బిల్లులు చెల్లించలేదని ఆర్ట్, వర్క్, హెల్త్ అండ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ పార్టుటైమ్ కాంట్రాక్టు ఇన్‌స్ట్రక్టర్ల ఫెడరేషన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా పనిచేస్తున్న 55 మంది డ్రాయింగ్ టీచర్లను వాల్ ఆర్ట్ వర్క్ పని నిమిత్తం తీసుకున్నారన్నారు. దీంతో రూ.6.75 లక్షలు సొంత నిధులు వెచ్చించి అప్పట్లో ఆ పనులు పూర్తి చేశామని చెప్పారు. పలు పర్యాయాలు స్పందనలో అర్జీలు అందించాం. తమకు చెల్లించాల్సిన బకాయి నిధులు వెంటనే విడుదల చేసి అప్పుల పాలైన తమ కుటుంబాలను ఆదుకోవాలని అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కన్నాబత్తుల రామ్మోహన్, ఉపాధ్యక్షుడు మిరప రాజుతో పాటు పలువురు ఆందోళన చేశారు.

స్వగ్రామంలో ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

గ్రామంలో సుమారు 30 ఎకరాల ప్రభుత్వ భూమి ఉన్నా అయినప్పటికీ పక్క గ్రామంలో ఇళ్ల స్థల పట్టాలు ఇచ్చారని ఉప్పలగుప్తం మండలం విలసవిల్లి గ్రామస్థులు అర్జీ అందించారు. పలు పర్యాయాలు అధికారుల చుట్టూ తిరిగినా పట్టించుకోలేదని గ్రామంలోని ప్రభుత్వ స్థలంలో లేఅవుట్ వేసి అర్హులైన పేదలకు ఇళ్లస్థల పట్టాలు ఇవ్వాలని అర్జీలో పేర్కొన్నారు.



అర్జీ ఇచ్చేందుకు కలెక్టరేట్‌కు వచ్చిన విలసవిల్లి గ్రామస్థులు





గద్దెల వద్దకు వీరభద్రులను తీసుకువస్తున్న భక్తులు

వీరభద్రుడి సంబరం

మండపేట, ఫిబ్రవరి,19: మండపేట మండలం ఏడిద గ్రామంలో సోమవారం వీరభద్రుని సంబరం ఘనంగా జరిగింది. టైలర్ శ్రీను సారథ్యంలో భక్తిశ్రద్ధలతో కార్యక్రమం జరిగింది. ఈ సంబరాల్లో తెలుగు రాష్ట్రాలతో పాటు, కర్ణాటక, ఒడిసా రాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చి సంబరాల్లో పాల్గొన్నారు. తొలుత స్థానిక పంచాయతీ వద్ద గల గద్దె దగ్గర ప్రత్యేక పూజలు అనంతరం పెళ్లిళ్ల సమయంలో బోణాలు పోసుకున్న వారంతా తమ వీరభద్రులను ఈ గద్దె వద్ద అప్పగించారు. రెండేళ్లకోసారి జరిగే ఈ సంబరాలకు గద్దెలో వీరభద్రుడిని అప్పగించిన వారంతా తప్పని సరిగా హాజరవుతుంటారని స్థానికులు తెలిపారు. వీరభద్రుడిని శిరస్సున ధరించి సంబరాల్లో పాల్గొంటారు. 50 ఏళ్ల నుంచి ఈ వేడుకలను క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నట్లు టైలర్ శ్రీను తెలిపారు.

వద్దిపర్రులో చర్చి దగ్ధం

క్రైస్తవ సంఘాల ఆందోళన

8లో



కోటిపల్లిలో శివరాత్రి ఏర్పాట్లపై అధికారుల సమీక్ష

కె.గంగవరం, ఫిబ్రవరి19: కోటిపల్లి పుణ్యక్షేత్రంలో మార్చి 8 నుంచి జరగనున్న శివరాత్రి ఉత్సవాలను విజయవంతం చేయాలని ఉత్సవ కమిటీ ఛైర్మన్, రామచంద్రపురం ఆర్డీవో సుధా సాగర్ అన్నారు. సోమవారం శ్రీ ఛాయాసోమేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఉత్సవాల నిర్వహణపై ఆయన వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. దేవదాయశాఖ, పంచాయతీ, ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్, పోలీస్, ఫైర్, విద్యుత్, రవాణా, ఆర్టీసీ, ఆరోగ్యశాఖ తదితర శాఖల అధికారులు ఏఏ పనులు నిర్వహిస్తున్నారో సభలో వివరించారు.

కష్టతరంగా ఏర్పాట్లు

కోటిపల్లి పుణ్యక్షేత్రంలో నిర్వహించే శివరాత్రి ఉత్సవాల నిర్వహణ ఏర్పాట్లకు చాలా కష్టంగా ఉంటుందని సర్పంచ్ పెమ్మాడి బేబి సత్తిబాబు సభలో ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీలో నిధులు అంతంత మాత్రంగానే ఉంటున్నాయన్నారు. గత ఉత్సవాల కోసం ఖర్చు చేసిన నిధులు ఇప్పటి వరకూ మంజూరు కాలేదని వాపోయారు. అన్ని శాఖల వారు ఆయా శాఖల వారీగా ఏర్పాట్లు కోసం ఖర్చులు చేసుకోవాలని, తద్వారా పంచాయతీ మీద భారం తగ్గించాలని కోరారు.

దాతల సాయం తీసుకుంటాం

ఉత్సవాల నిర్వహణ కోసం దాతల సహాయం తీసుకుందామని సభకు హాజరైన రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్ అన్నారు. పంచాయతీల్లో నిధులు కొరత ఉన్నందున ఇతర మార్గాలు అన్వేషించాలని సూచించారు. దీనిపై జిల్లా కలెక్టర్, దేవాదాయశాఖ ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. ఈ సమావేశంలో ఎంపీపీ పంపన నాగమణి సుబ్బారావు, సర్పంచ్ పెమ్మాడి బేబి సత్తిబాబు, దేవాదాయశాఖ తనిఖీ అధికారి బాలాజీ రామ్‌ప్రసాద్, ఈవో ఎం. శ్రీదేవి, మాజీ సర్పంచ్ అయినవిల్లి వీరవెంకట సత్యనారాయణ(అబ్బు) తదితరులు పాల్గొన్నారు.



సమీక్ష నిర్వహిస్తున్న ఎంపీ బోస్, ఆర్డీవో

వైభవంగా నారసింహుడి కల్యాణం


లక్ష్మీనరసింహస్వామి కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

- కల్యాణం తంతు నిర్వహించిన వేద పండితులు
- పట్టువస్త్రాలు సమర్పించిన శృంగేరి, పోలమూరు వారు
- కనులారా వీక్షించిన భక్తజన సందోహం

అంతర్వేది, ఫిబ్రవరి 19: నవ నారసింహ క్షేత్రాల్లో అగ్రగామి అయిన అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానం కల్యాణోత్సవ శోభతో వెల్లివిరిసింది. వేద మంత్రోచ్చారణలతో సకల దేవతల ఆశీర్వచనాలతో శ్రీలక్ష్మీనరసింహస్వామివారు ఉభయ దేవేరులైన భూదేవి, శ్రీదేవిలను కల్యాణమాడారు. శ్రీ వైఖానస ఆగమానుసారం వైష్ణవ సాంప్రదాయం ప్రకారం ఆలయ స్థానాచార్యులు వింజమూరి రామలింగాచార్యులు, ప్రధాన అర్చకులు పాణింగపల్లి శ్రీనివాసకిరణ్, వేదపండితులు చింతా వేంకటశాస్త్రివారి సమక్షంలో అర్చక బృందం పేరూరు ఉద్దండ పండితులు కల్యాణాన్ని నిర్వహించారు. సాంప్రదాయ పద్ధతిలో సాగిన ఈ కల్యాణ తంతును భక్తులు తన్మయత్వంతోచూసి తరించారు. అంతర్వేదిలో శ్రీలక్ష్మీనరసింహ స్వామివారి కల్యాణం సోమవారం దశమి రాత్రి 12:29 గంటలకు ఆరుద్ర నక్షత్రయుక్త వృశ్చికలగ్న పుష్కరాంశమందు వైభవంగా జరిగింది. వైష్ణవ సాంప్రదాయబద్ధంగా వేద పండితులు, అర్చక స్వాములు కల్యాణ కార్యక్రమం నిర్వహించారు. శుభ ముహుర్తానికి జీలకర్ర, బెల్లం స్వామివారి శిరస్సుపై ప్రధాన అర్చకులు పాణింగపల్లి శ్రీనివాసకిరణ్, శ్రీదేవి, భూదేవి అమ్మవార్ల శిరస్సులపై సహాయఅర్చకులు ఉంచారు. ఆలయం ముందు నిర్మించిన శాశ్వత షెడ్లలో భక్తులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు ఆసీనులై స్వామివారి కల్యాణం వీక్షించారు. ఉభయ రాష్ట్రాలతోపాటు ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామివారి కల్యాణం తిలకించారు. సుమా రు నాలుగు గంటల పాటు సాగిన స్వామివారి కల్యాణాన్ని భక్తులు ఆద్యంతం వీక్షించారు. స్వామివారి కల్యాణాన్ని పురస్కరించుకుని దర్శనం కోసం సుదూర ప్రాంతాల నుంచి వస్తున్న భక్తులు ఉచిత దర్శనం కోసం ఎదురు చూశారు.


స్వామివారి గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

ఎదురు సన్నాహంతో శ్రీకారం

రాత్రి 10 గంటలకు ఎదురు సన్నాహంతో కల్యాణ తంతు ప్రారంభమైంది. అనాదిగా వస్తున్న సాంప్రదాయం ప్రకారం పశ్చిమగోదావరిజిల్లా మొగల్తూరుకు చెందిన ఆలయ ఫౌండర్, ఫ్యామిలీ మెంబరు రాజా కలిదిండి కుమార రామగోపాల రాజాబహదూర్ శ్రీవారి తరపున, అర్చక స్వాములు అమ్మవారి తరపున వివాహకర్తలుగా వ్యవహరించారు. ఆలయం నుంచి తొలుత స్వామివారిని తర్వాత అమ్మవార్లను వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య అర్చకులు, అధికారులు పల్లకీలో వేర్వేరుగా కల్యాణ మండపానికి తీసుకువచ్చారు. శ్రీవారు, అమ్మవార్లకు అంతర్వేదికరకు చెందిన డాక్టర్ పోతురాజు సూర్యవెంకట సత్యనారాయణ, కుటుంబీకులు గతంలో ఇచ్చిన ఆభరణాలను అర్చకులు అలంకరించారు. కల్యాణం నిర్వహణలో ఆనవాయితీ ప్రకారం పేరూరు వేద పండితులు వచ్చి స్వామిని దర్శించుకున్నారు. స్వామివారి తలంబ్రాలను పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన పోలమూరి కుటుంబీకులు తీసుకువచ్చారు.

స్వామి, అమ్మవార్లకు మధుపర్కాలు..

కల్యాణానికి ముందు దేవస్థానం తరపున ఆలయ అధికారులు, ప్రభుత్వ ప్రతినిధిగా రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు, మొగల్తూరు రాజా వారు ఆలయ ఫౌండర్ రాజాకలిదిండి కుమారరామగోపాల రాజా బహదూర్, కలెక్టర్ హిమాన్షు శుక్లా, అమలాపురం ఆర్డీవో జి.కేశవర్ధనరెడ్డి, ఎస్పీ ఎస్.శ్రీధర్, ఆలయ అధికారులు, భక్తులు శ్రీ స్వామి, అమ్మవార్లకు మధు పర్కాలు సమర్పించారు.

అద్భుతంగా విద్యుత్ అలంకరణలు

స్వామివారి కల్యాణోత్సవాల్లో భాగంగా అంతర్వేది పుణ్యక్షేత్రం విద్యుత్ అలంకరణల నడుమ రంగురంగులతో భక్తులకు కనువిందు చేస్తుంది. భక్తుల రద్దీ ఉన్న ప్రతి ప్రధాన కూడలిలో కల్యాణోత్సవాలను తిలకించేలా ఎల్ఈడీ స్క్రీన్లు ఏర్పాటుచేసి గ్రామ పురవీధుల ముఖద్వారాలను సుందరంగా విద్యుత్ కాంతులతో అలంకరించారు. స్వామివారి కల్యాణ మండపాన్ని, ఆలయాన్ని అద్భుతంగా విద్యుత్ కాంతులతో అలంకరించారు. అయోధ్య బాలరాముడు, వెంకటేశ్వరస్వామి, ఆంజనేయస్వామి, వివిధ సెట్టింగ్‌లతో ఆలయ పుణ్య క్షేత్ర మంతా అలంకరించారు.


రద్దీగా మారిన అన్నవరం సత్యదేవుడి ఆలయ ప్రాంగణం


అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి కల్యాణాన్ని తిలకించడానికి వచ్చిన భక్తులు


స్వామి కల్యాణానికి హాజరైన ఎస్పీ శ్రీధర్ దంపతులు




గ్రామోత్సవం


పంచముఖ ఆంజనేయస్వామి వాహనంపై నిర్వహిస్తున్న స్వామివారి గ్రామోత్సవం

అంతర్వేది, ఫిబ్రవరి 19: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా సోమవారం సాయంత్రం 4గంటలకు శృంగవరప్పాడు వాస్తవ్యులు రావి సత్యనారాయణమూర్తి, నరసింహస్వామివారిచే నిర్మితమైన శ్రీ పంచ ముఖ ఆంజనేయస్వామివారి వాహనంపై స్వామివారి గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. గ్రామ పురవీధుల్లో స్వామివారు గ్రామోత్సవం జరగ్గా భక్తులంతా స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం స్వామివారికి హారతులు పట్టి కొబ్బరికాయలు కొట్టారు. రాత్రి 7గంటలకు అంతర్వేది పల్లిపాలెం అగ్నికుల క్షత్రియులచే నిర్మితమైన కంచుగరుడ వాహనంపై స్వామివారి గ్రామోత్సవం ఘనంగా జరిపారు. అనంతరం స్వామివారిని కల్యాణ మండపానికి తీసుకునివెళ్లారు. కార్యక్రమంలో ఆలయ ఫ్యామిలీ ఫౌండర్ రాజా కలిదిండి కుమారరామగోపాల రాజాబహదూర్, డీసీ విజయరాజు, అమలాపురం ఆర్డీవో జి.కేశవర్ధనరెడ్డి, ఆలయ ఏసీ వి.సత్యనారాయణ, ఎంపీపీ వీరా మల్లిబాబు, వలవల రాంబాబు, పి.వెంకటకృష్ణ, మూలాస్వామి, భక్తులు పాల్గొన్నారు.

నేడు లక్ష్మీనరసింహస్వామి రథోత్సవం



శ్రీలక్ష్మీనరసింహస్వామివారి కల్యాణోత్సవాల్లో భాగంగా సోమవారంరాత్రి జరిగిన స్వామివారి కల్యాణం, అనంతరం మంగళవారం భీష్మఏకాదశి సందర్భంగా స్వామివారి రథోత్సవం ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. మధ్యాహ్నం 2.00 గంటలకు శ్రీ స్వామివారి రథోత్సవం ప్రారంభం కానుంది. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు సోమవారం రాత్రికే రథంవద్ద అరటిపండ్లు, గుమ్మడికాయలు, ధాన్యం కుచ్చులను వాహనకారులకు ఇచ్చారు. వాటితో వాహనకారులు రథాన్ని అలంకరించారు. శ్రీ స్వామివారి రథోత్సవం రాజావారి వీధి నుంచి ఆచార సాంప్రదాయాల లాంచనాలతో సోదరి గుర్రాలక్కమ్మ అశ్వరూఢాంబిక ఆలయం వద్దకు చేరుకుని చీర, సారెలతో సోదరికి అందజేసి తిరుగు ప్రయాణంలో స్వామివారి రథం 16స్తంభాల మండపం వద్దకు చేరుకుంటుంది.

నేడు ధవళేశ్వరం జనార్ధన స్వామి రథోత్సవం


ఉభయ దేవేరులతో జనార్ధన స్వామి, రథోత్సవం (ఫైల్)



ధవళేశ్వరం, ఫిబ్రవరి 19: పురాణ ప్రసిద్ధిగాంచి జనార్ధనగిరిపై ఉన్న లక్ష్మీ జనార్ధనస్వామి రథోత్సవం మంగళవారం వైభవంగా నిర్వహించడానికి అధి కారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. ఆలయ పరిసరాలను చలువ పందిళ్ల, విద్యుత్ దీపాలతో అలకరించారు. భక్తుల దర్శనార్థం ప్రత్యేక లైన్‌లు ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం 3గంటలకు ఉత్సవమూర్తులను రథంపై ఆశీనులు చేసి పురవీధుల్లో ఊరేగిస్తారు. దక్షిణ మండలి డీఎస్పీ అంబికా ప్రసాద్ ఆధ్వర్యంలో సీఐ వినయ్ మోహన్ పర్యవేక్షణలో బందోబస్తు నిర్వహించనున్నారు. రాత్రికి కొండపై స్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని నిర్వహిస్తారు.

భీష్మ ఏకాదశి సందర్భంగా ..

సత్యదేవుడి దర్శనానికి పోటెత్తిన భక్తులు

- వసతి గదులు సరిపడక భక్తుల అవస్థలు

అన్నవరం, ఫిబ్రవరి 19: సత్యదేవుడి సన్నిధి మంగళవారంరోజున భీష్మ ఏకాదశి పర్వదినం పురస్కరించుకుని స్వామి దర్శనానికి సోమవారం రాత్రికే తరలిరావడంతో ఆలయప్రాంగణం పోటెత్తింది. సత్రంగదులు సరిపడకపోవడంతో భక్తులు అవస్థలు ఎదుర్కొన్నారు. ఆలయప్రాంగణంలో సేద తీరారు. రద్దీని దృష్టిలో ఉంచుకుని సోమవారంరాత్రి 11గంటల నుంచి వ్రతం టిక్కెట్లను విక్రయించి ఒంటిగంట నుంచి వ్రతాలు, రెండుగంటల నుంచి సర్వదర్శనాలు ప్రారంభించాలని ఈవో రామచంద్రమోహన్ సర్క్యులర్ జారీ చేశారు. భక్తులకు క్యూలైన్‌లో ఎటువంటి అవస్థలు పడకుండా త్రాగునీరు అందించాలని సిబ్బందిని ఆదేశించారు. అవసరమైతే రద్దీ నియంత్రణకు అంత్రాలయ ప్రదక్షణ, యంత్రాలయ దర్శనం తాత్కాలికంగా నిలుపుదలచేసి లఘు దర్శనానికి పరిమితం చేయాలని ఆలయవిభాగ సిబ్బందికి సూచించారు. నిరంతరాయంగా పులిహోర వితరణ చేపట్టాలని సూచించారు.

స్వామివారికి బంగారు ఆభరణాల అలంకరణ


కల్యాణోత్సవాల్లో స్వామివారికి అలంకరించే ఆభరణాలు



అంతర్వేది, ఫిబ్రవరి 19: అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా తొమ్మిది సంవత్సరాల నుంచి స్వామివారి పూర్వ నగలను బ్యాంకులో ఉంచి ప్రస్తుతం కొత్త ఆభరణాలతో అలంకరిస్తున్నారు. స్వామివారి కల్యాణ సమయంలో స్వామివారి కుందనపు కిరీటం ధరిస్తారు. వక్షస్థలం, శంఖుచక్రాలు, అనేక బంగారు ఆభరణాలు ధరించే స్వామివారిని దర్శించుకోవడంవల్ల జన్మజన్మల పుణ్యఫలం వస్తుందని పండితులు చెబుతున్నారు. ఈ ఆభరణాలన్నీ వజ్రవైఢూర్యాలు, మరకత మాణిక్యాలు వంటివి పూర్వకాలంలో మహారాజులు సమర్పించారని చెబుతారు. పూర్వపు ఆభరణాలు శిథిలావస్థకు చేరుకోవడంవల్ల బ్యాంకుల్లో భద్రపరిచారు. అంతర్వేదికర గ్రా మంలో ఉన్న అంతర్వేదికి చెందిన దివంగత డాక్టర్ పోతురాజు సూర్యవెంకట సత్యనారాయణ కుటుంబ సభ్యులచే ఉత్సవమూర్తులకు మాత్రం సాదా ఆభరణాలు తయారుచేయించి వార్షికంగా ఉత్సవాలకు అలంకరిస్తున్నారు. పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం వాస్తవ్యులు మిరియాల గాంధీ దంపతులు స్వామివారికి బంగారు శఠగోపాన్ని, పూణె వాస్తవ్యులు వేంకటేశ్వరా హేచరీసంస్థ నిర్వాహకులు స్వామివారికి బంగారు పంచపాత్రలు, ఉద్ధరిణీలు, బిందె, పళ్లెం, బంగారు ఆభరణాలు సమర్పించారు.

పట్టువస్త్రాలు, తలంబ్రాలు అందజేత

అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామివారి కల్యాణోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి జరిగిన వార్షిక దివ్య తిరు కల్యాణానికి పోలమూరు, శ్రీశృంగేరి జగద్గురు భారతీతీర్థ మహాస్వామి, విధుశేఖరభారతిస్వామివార్లు తలంబ్రాలు, పట్టువస్త్రాలు అందించారు. గుడిమెల్లంక శ్రీవిద్యాభారతి శంకరపీఠం తరుపున దేవదాయశాఖ, ఆలయ అధికారులకు, పండితులకు అందించినట్టు తెలిపారు.

గోరంట్ల శాంతారావు మెడికల్ సెంటర్ ప్రారంభం


ఆసుపత్రిని ప్రారంభిస్తున్న రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 19: పేద, మధ్యతరగతి ప్రజలకు తక్కువ ధరలకు నాణ్యమైన మెరుగైన వైద్యం అందించాలనే ఉద్దేశంతో 20 పడకల ఆసుపత్రి నిర్మించడం జరిగిందని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. రాజమహేంద్రవరం రూరల్ మండలం హుకుంపేట ఆదర్శనగర్‌లో డాక్టర్ రవిరామ్ కిరణ్ గోరంట్ల, డాక్టర్ రేఖ పోతూరి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గోరంట్ల శాంతారావు మెడికల్ సెంటర్‌ను సోమవారం ప్రారంభించారు. న్యూరాలజీ ,మెదడు, జనరల్ వైద్యవిభాగం గైనకాలజీ సేవలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ జనరల్ సర్జన్ తాతిన రాంబ్రహ్మం, డాక్టర్ పొత్తూరి చౌడప్ప , జీఎస్ఎల్ చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు, కాకినాడకు చెందిన సైక్రియాట్రిస్ట్ డాక్టర్ మల్లికార్జునరావు, పీడియాట్రిక్స్ డాక్టర్ పాకలపాటి రవికిరణ్, ప్రముఖ న్యూరాలజిస్ట్ అశుతోష్ ప్రసాద్, డాక్టర్లు ఎస్ఎస్ రామరాజు, డాక్టర్ కర్రి రామారెడ్డి, నిమ్మలపూడిగోవిందు, డాక్టర్ పి.రవికిరణ్ పాల్గొన్నారు.

తెలుగు బుక్ ఆఫ్ రికార్డులో

సత్యదేవ నర్సరీకి స్థానం


తెలుగుబుక్ ఆఫ్ రికార్డు, మిరాకిల్ వరల్డ్ పత్రాలు చూపుతున్నచంటి, పెదసత్యనారాయణ

కడియం, ఫిబ్రవరి 19: భారత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన అయోధ్య రామమందిరం, బాలరాముని విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా కడియపులంక పుల్లా చంటియ్యసత్యదేవా నర్సరీలో మొక్కలతో రామమందిరం, రాముని ప్రతిరూపం, అయోధ్య ఆలయం, దేశప్రధాని మోదీ ప్రతిరూపాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. ఇందుకుగాను తెలుగు బుక్ ఆఫ్ రికార్డు, మిరాకిల్ వరల్డ్‌లో స్థానం దక్కింది. తమకు తెలుగు బుక్ ఆఫ్ రికార్డు, మిరాకిల్ వరల్డ్‌లో స్థానం దక్కడం సంతోషంగా ఉందని చంటియ్య ఆయన కుమారుడు పెదసత్యనారాయణ అన్నారు.

వేటకు వెళ్లి గుండెపోటుతో మత్స్యకారుడు మృతి



కరప, ఫిబ్రవరి 19: సముద్రంలోకి వేటకెళ్లిన మత్స్యకారుడు బోటులోనే గుండెపోటుతో మరణించిన ఘటన కాకినాడజిల్లా కరప మండలం ఉప్పలంకలో జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం ఉప్పలంక గ్రామానికి చెందిన పెసంగి వెంకటేశులు(52)సోమవారం తెల్లవారుజామున సహచర మత్స్యకారులతో కల్పి సముద్రంలోకి వేటకు వెళ్లాడు. వేట సమయంలో గుండెలో నొప్పి ఉందని వెంకటేశులు చెప్పడంతో వెంటనే సహచరులు బోటును ఒడ్డుకు చేర్చేందుకు వేగంగా వస్తుండగా మార్గమధ్యలో బోటులోనే మరణించాడు. మృతు నికి భార్య చంద్రమ్మ, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. దీంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. సర్పంచ్ బొమ్మిడి నయోమి, వైసీపీ గ్రామకమిటీ అధ్యక్షులు బొమ్మిడి సతీష్‌లు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. వెంకటేశులు మృతి చెందడం వారికుటుంబీకులు దిక్కులేని వారయ్యారని బాధితుల పరిస్థితిని ఎమ్మెల్యే కన్నబాబు దృష్టికి తీసుకెళ్లి సాయమందించాలని కోరారు.

క్రీడల్లో ఉన్నతంగా రాణించాలి

- సినీ హాస్యనటుడు ఆలీ


క్రికెట్ పోటీల ప్రారంభోత్సవంలో సరదాగా బ్యాటింగ్ చేస్తున్న ఆలీ

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 19: క్రీడల్లో ఉన్నతంగా రాణించాలని, జాతీయ అంతర్జాతీయ క్రీడాకారులుగా ఎదగాలని ప్రముఖ సినీ హాస్య నటుడు ఆలీ అన్నారు. రాజమహేంద్రవరంలో సోమవారం ఆర్‌పీఎల్ (రాజమహేంద్రవరం ప్రీమియర్ లీగ్) సీజన్-6 క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. కొద్దిసేపు బ్యాటింగ్ చేసి అలరించారు. జాతీయస్థాయిలో రాణించిన ఎందరో క్రీడాకారులు చిన్న చిన్న టోర్నమెంట్లలో ఆడినవారే ఉన్నారు. ఎంపీ భరత్‌రామ్ మాట్లాడుతూ 2031 నాటికి ఇక్కడి క్రీడాకారులు ఒలింపిక్స్‌లో పాల్గొనేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు, టోర్నమెంట్ నిర్వాహకులు అజ్జరపు వాసు, కుంచే శేఖర్, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో నిందితుడికి మూడేళ్ల జైలు

కాకినాడ క్రైం, ఫిబ్రవరి 19: డ్రైనేజీకి సంబంధించిన గొడవ విషయమై గునపంతో దాడికి పాల్పడి హత్యాయత్నానికి ప్రయత్నించిన నిందితుడికి మూడేళ్ల జైలు శిక్షతోపాటు రూ.10వేల జరిమానా విధిస్తూ కాకినాడ ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్స్ కోర్టు జడ్జి తీర్పునిచ్చారు. కాకినాడ అర్బన్ గొడారిగుంట సీతారామ్‌నగర్‌కు చెందిన తల్లిబోయిన వెంకన్న బావమరిది కఠారిశ్రీను ఇంటి పక్కన నివాసం ఉండేవారు. 2020, సెప్టెంబరు 29న డ్రైనేజీకి సంబంధించిన గొడవ విషయమై గొల్లపల్లి దుర్గాలు, కొండ వెంకటేష్, గొల్లపల్లి రమణ, కొండ మణికంఠ మధ్య తలెత్తిన వివాదంతో వీరంతా కలసి తల్లిబోయిన వెంకన్నపై గునపంతో, రాళ్లతో దాడి చేసి చంపడానికి ప్రయత్నించారు. ఈ సంఘటనపై కాకినాడ సర్పవరం పోలీస్‌స్టేషన్‌లో బాధితుడు ఫిర్యాదు చేశారు. అప్పటి ఎస్ఐ ఎన్.సతీష్‌బాబు కేసు నమోదు చేసి నిందితులను అరెస్ట్ చేశారు. ఈ కేసులో నిందితులను సోమవారం కాకినాడ ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్స్ కోర్టులో ప్రవేశపెట్టగా సాక్షులను విచారించిన తర్వాత నిందితులపై నేరం రుజువు కావడంతో ఏ1 నిందితుడిగా ఉన్న గొల్లపల్లి దుర్గాలుకు మూడేళ్ల జైలు శిక్ష, రూ.10వేల జరిమానా విధిస్తూ జడ్జి ఎంవీఎస్ పద్మజ తీర్పునిచ్చినట్లు సర్పవరం ఎస్‌హెచ్‌వో వైఆర్‌కే శ్రీనివాస్ తెలిపారు. ఏ2 కొండ వెంకటేష్, ఏ3 గొల్లపల్లి రమణ, ఏ4 కొండ మణికంఠలకు తలో రెండేళ్ల జైలు శిక్షతోపాటు రూ.3వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారన్నారు. ప్రాసిక్యూషన్ తరపున పీపీ కె.రాధాకృష్ణరాజు వాదించారు. ఈ కేసులో నిందితులకు శిక్ష పడేలా చర్యలు తీసుకున్న సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ సిబ్బందిని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ప్రత్యేకంగా అభినందించారు.

పంటబోదెలోకి దూసుకెళ్లిన వ్యాన్

- ఒకరి మృతి.. ఇద్దరికి స్వల్పగాయాలు


మృతుడు చైతన్‌దాడియ

దేవరపల్లి, ఫిబ్రవరి 19: జీవనోపాధి కోసం వచ్చి రోడ్డు ప్రమాదానికి గురై వ్యక్తి మృతి చెంది కుటుంబానికి విషాదం మిగిల్చిన ఘటన దేవరపల్లి మండలం కృష్ణపాలెం జాతీయ రహదారివద్ద జరిగింది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు సోమవారం భీమవరం నుంచి విశాఖపట్నం డెకరేషన్ సామగ్రితో వెళ్తున్న వ్యాన్ దేవరపల్లి మండలం కృష్ణంపాలెం సమీపంలో సర్వీసు రహదారిలో పంటబోదెలోకి దూసుకెళ్లి సిమెంటు దిమ్మను ఢీకొట్టింది. వ్యాన్ క్యాబిన్‌లో ముగ్గురు ప్రయాణిస్తుండగా ఒరిస్సాకు చెందిన వ్యాన్ క్లీనర్ చైతన్ దాలియ(54) అక్కడికక్కడే మృతి చెందాడు. డ్రైవర్, మరొకరికి స్వల్ప గాయాలు కావడంతో గోపాలపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కాగా దాలియ ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. అతడు ఇటీవల జీవనోపాధి నిమిత్తం కుమారుడితో కలిసి విశాఖపట్నం వచ్చాడని, ఈనెల 17న భీమవరంలోని ఒక ఫంక్షన్‌కు డెకరేషన్‌చేసి ఆదివారం తెల్లవారుజామున తిరిగి సామగ్రితో వెళ్తుండగా డ్రైవర్ నిద్ర మత్తువల్ల ప్రమాదం జరిగినట్టు తెలిసింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గోపాలపురం ప్రభుత్వాసుపత్రికి తరలించామని, ఈ ఘటనపై కేసు నమో దుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ శ్రీహరిరావు తెలిపారు.

ఉప్పుటేరులో ఈతకు వెళ్లి విశాఖ యువకుడి మృతి


మృతిచెందిన షేక్ మౌలాలీ

కొత్తపల్లి, ఫిబ్రవరి 19: ఉప్పుటేరులో స్నేహితులతో ఈతకు వెళ్లిన విశాఖకు చెందిన యువకుడు మృతి చెందినట్టు కొత్తపల్లి ఎస్ఐ పీవీ స్వామినాయుడు తెలిపారు. విశాఖపట్నానికి చెందిన మౌలాలి(22) ఆదివారం కొత్తపల్లి మండలం పొన్నాడలో జరిగిన బంగారుపాప ఉరుసు ఉత్సవాల్లో పాల్గొన్నాడు. తిరుగు ప్రయాణంలో స్నేహితులతో కలిసి స్థానికంగా రామన్నపాలెం, మూలపేట మధ్య ఉన్న ఉప్పుటేరులో ఈతకు వెళ్లాడు. ఒడ్డుకు చేరే ప్రయత్నంలో ఉప్పుటేరు ఉధృతికి మౌలాలి నీటమునిగి ఊపిరి ఆడక మృతి చెందాడు. అతడి స్నేహితులు క్షేమంగా ఒడ్డుకు చేరుకున్నారు. మౌలాలి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

సందేశాన్ని ఇస్తూ...ఆలోచింపజేసిన నాటికలు


స్వర్గానికి వంతెన నాటిక సన్నివేశం

తాటిపర్తిలో ముగిసిన ఉభయ తెలుగురాష్ట్రాల నాటికల పోటీలు

గొల్లప్రోలురూరల్, ఫిబ్రవరి 19: సమాజంలో జరుగుతున్న విషయాలు, సంఘటనలకు అద్దం పడుతూ అదే సమయంలో అందరినీ ఆలోచింపచేస్తూ, సందేశాన్ని ఇస్తూ సాగాయి నాటికలు. గొల్లప్రోలు మండలం తాటిపర్తి గ్రామంలో మార్కండేయ నాటక కళాపరిషత్ ఆధ్వర్యంలో అపర్ణా కళాతోరణం బత్తుల మురళీకృష్ణ కళావేదికపై జరుగుతున్న ఉభయ తెలుగురాష్ట్రాల నాటికల పోటీల్లో భాగంగా చివరిరోజు ప్రదర్శించిన నాటికలు అన్నింటికీ డబ్బే ప్రధానం కాదని, చేసిన మంచి పని ఎల్లప్పుడూ గుర్తు ఉంటుందని తెలియజేశారు.

- మనిషికి మరణం అనివార్యం. జీవితకాలంలో మంచి పనులు చేస్తే అవి ఎల్లప్పుడు గుర్తు ఉంటాయి అని చాటి చెప్పింది స్వర్గానికి వంతెన నాటిక. తాడేపల్లి అరవింద ఆర్ట్స్ కళాకారులు ప్రదర్శించిన ఈ నాటికను వల్లూరు శివప్రసాద్ రచించగా, గంగోత్రిసాయి దర్శకత్వం వహించారు.
- డబ్బు కోసం ఆడిన పెళ్లి నాటకం బయటపడటం, అదే అదనుగా న్యాయవాది ఆ మహిళను వివాహం చేసుకోవాలనుకోవడం, చివరికి అన్ని విషయాలు బయటకు వచ్చి తప్పుడు మార్గంలో పయనించాలనుకున్న వారికి బుద్ధి చెప్పడాన్ని పక్కింటి మొగుడులో ప్రదర్శించారు. కొప్పోలు పండు క్రియేషన్స్ కళాకారులు ప్రదర్శించిన ఈ నాటికను గోవిందరాజు నాగేశ్వరరావు రచించగా, బాలినేని నాగేశ్వరరావు దర్శకత్వం వహించారు.

ఉత్తమ ప్రదర్శనగా ఇంద్రప్రస్థం నాటిక

ఉభయ తెలుగురాష్ట్రాల నాటికల పోటీల ప్రదర్శనలో గుంటూరు అభినయ ఆర్ట్స్ కళాకారులు ప్రదర్శించిన ఇంద్రప్రస్థం నాటిక ప్రథమ ఉత్తమ ప్రదర్శనగా ఎంపికైంది. ద్వితీయ ఉత్తమ ప్రదర్శనగా అమరావతి ఆర్ట్స్ కళాకారులు ప్రదర్శించిన అమృతహస్తం, తృతీయ ఉత్తమ ప్రదర్శనగా విజయవాడ మైత్రి కళానిలయం కళాకారులు ప్రదర్శించిన బంధం నాటికలు ఎంపికయ్యాయి. ఉత్తమ దర్శకుడిగా ఎన్.రవీంద్రరెడ్డి(ఇంద్రప్రస్థం), ఉత్తమ రచనగా సత్యనారాయణ(అమృతహస్తం), ఉత్తమ నటుడిగా గోపరాజు విజయ్(కౌలస్య సుప్రజ రామ), ఉత్తమ నటిగా రత్నకుమారి(బంధం), ఉత్తమ ప్రతినాయకుడిగా ఏపూరి హరిబాబు(అమృతహస్తం)లు ఎంపిక కాగా జ్యూరీ అవార్డులకు పిఠాపురం బాబూరావు, టి.శ్రీలేఖ, సురభిలతలు ఎంపికయ్యారు. న్యాయనిర్ణేతలుగా రాజా తాతయ్య, గారపాటి శ్రీనివాస్‌లు వ్యవహరించగా, మార్కండేయ నాటక కళాపరిషత్ అధ్యక్షుడు, న్యాయవాది పడాల రవి తదితరులు విజేతలకు నగదు పురస్కారాలు, షీల్డులు అందజేశారు.


విజేతలకు బహుమతులు అందజేత

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు

శంఖవరం, ఫిబ్రవరి 19: తెలంగాణ రాష్ట్రానికి చెందిన ప్రైవేట్ ట్రావెల్ బస్సు సోమవారం కాకినాడజిల్లా కత్తిపూడి పాత చెక్‌పోస్టు వద్ద విద్యుత్ స్తంభాన్ని ఢీకొని బోల్తాపడింది. విశాఖ నుంచి భద్రాచలం వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. అన్నవరం ఎస్ఐ కిషోర్ తెలిపిన వివరాల ప్రకారం... డ్రైవర్‌కి బీపీ తక్కువకావడంతో ఇబ్బంది పడుతుండగా అదుపుతప్పి బోల్తా పడిందన్నారు. పదిమంది స్వల్పంగా గాయపడగా ప్రాథమిక వైద్యం అందించి వేరే బస్సులో వారి గమ్యస్థానాలకు పంపారు. కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.


విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న ట్రావెల్స్ బస్సు

అభివృద్ధిపై చర్చకు సిద్ధం

అంతర్వేది, ఫిబ్రవరి 19: ఒక్క చాన్సు అని అబద్ధపు వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వానికి అభివృద్ధిపై చర్చించడానికి సిద్ధమా అని గొల్లపల్లి సూర్యారావు అన్నారు. సోమవారం వీవీమెరక గ్రామంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రజలను మోసం చేసిన వైసీపీ ప్రభుత్వం ఇటీవల బహిరంగ సభల్లో జగన్మోహన్‌రెడ్డి అబద్ధాలు చెబుతూ ఇంకామోసం చేయాడానికి చూస్తున్నాడన్నారు. కొల్లాబత్తుల కుమార్, చాగంటి స్వామి, కొండా శివయ్య, పిండి సత్యనారాయణ పాల్గొన్నారు.

• శరభ..శరభ.. అంటూ భక్తుల తన్మయత్వంతో బండారులంక పురవీధులు పుల కింత • త్రిశూలాలను ధరించి వేలాది మంది భక్తులు పురవీధుల్లో ఊరేగింపు

వైభవంగా వీరభద్రుని సంబరాలు

అమలాపురంరూరల్, ఫిబ్రవరి19: శరభ..శరభ.. అంటూ భక్తుల తన్మయత్వంతో బండారులంక పురవీధులు పులకించిపోయాయి. ఆత్మలకు ప్రతిరూపంగా.. ఈశ్వర తత్వా నికి నిదర్శనంగా విభూదిపండ్లను.. త్రిశూలాలను ధరించి వేలాది మంది భక్తులు పురవీధుల్లో ఊరేగారు. పాత బండారులంక శ్రీవీరన్నబాబు ఆలయం వద్ద సోమవారం జరిగిన వేడుకల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. చిన్నారులకు ప్రతిరూపాలుగా విభూదిపండ్లను గద్దెకు సమర్పించిన వారు వీరభద్రుని సంబరం రోజున ఎక్కడ ఉన్నా హాజరవ్వడం ఆనవాయితీ. వీరన్నబాబు ఆలయం వద్ద నుంచి వేలాదిమంది భక్తులు ఆర్లపల్లి అమ్మన్న ఆధ్వర్యంలో చినచంద్రపురంలోని శ్రీబాలాత్రిపుర సుందరి సమేత శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయం వద్దకు చేరుకు న్నారు. పూజలు నిర్వహించారు. భాజా భజంత్రీలతో ము రుగులమ్మ గుడిసెంటర్ నుంచి ప్రధాన రహదారి మీదుగా శ్రీభద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయం వద్దకు చేరుకోగా భక్తులు దారిపొడవునా స్వాగతం పలికారు. ఊరే గింపు ఆర్లపల్లి నాగేశ్వరరావు స్వగృహానికి చేరుకున్న తర్వాత వీరభద్రులను గద్దెల్లో ఉంచారు. అనం తరం వేలా దిమందికి అన్న సమారాధన జరిపారు. ఆలయం వద్ద ఆర్లపల్లి అమ్మన్నను మాజీ ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, మాజీ జడ్పీటీసీ చింతా శంకరమూర్తి తదితరుల ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పంచాంగకర్త కాలెపు భీమేశ్వరరావు సిద్ధాంతి, జంగా అబ్బాయివెంకన్న, నల్లా స్వామి తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా అమలాపురం దేవాంగుల వీధిలో అడ్డాల సూర్యకుమారి ఆధ్వర్యంలో వీరన్నబాబు సంబరం వైభవంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వందలాది మంది భక్తులు తరలిరాగా తలపై విబూది పండ్లను ధరించి త్రిశూలాలు చేతబూని గడియార స్తంభం సెంటర్ మీదుగా నల్లవంతెన వద్దనున్న ఆలయం వద్దకు చేరుకున్నారు.


అమలాపురం: బండారులంకలో త్రిశూలాలు ధరించి వీరభద్రునికి ప్రతీకగా విభూదిపండ్లను ఊరేగిస్తున్న వేలాదిమంది భక్తులు

వైభవంగా వీరభద్రుని సంబరం

అయినవిల్లి, ఫిబ్రవరి 19: యలకల్లంకలో వైభవంగా వీరభద్రుని సంబరం నిర్వహించారు. వీరభద్రుని గ్రామోత్సవం, నదీస్నానం, అభిషేకాలు, జమ్మిపూజ, రుద్రహోమం నిర్వహించారు. గణపతిపూజ, పుణ్యాహవచనం, రక్షాధారణ కార్యక్రమాలు జరిపించారు. అన్నసమారాధన జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. జనసేన పార్టీ పి.గన్నవరం ఇన్‌చార్జి గిడ్ల సత్యనారాయణ స్వామి వారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో పోలిశెట్టి శ్రీరంగనాయకులు, మామిళ్లపల్లి తాతాజీ, సలాది ప్రసాద్, మద్దా చంటిబాబు, పోలిశెట్టి రాజేష్, జంగా డేవిడ్‌రాజు, సలాది బుచ్చిరాజు, మేడిద దుర్గాప్రసాద్, వాసంశెట్టి కుమార్ పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం


రాయవరం వేంకటేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం.

రాయవరం,ఫిబ్రవరి19: రాయవరం శ్రీదేవిభూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం స్వామివారి అమ్మవార్ల దివ్యకల్యాణం ఘనంగా నిర్వహించారు. మాఘ మాసం మృగశిర నక్షత్రం పురస్కరించుకుని భక్త సంఘం ఆధ్వర్యంలో అంగర అయ్యామాచార్యులు ఆధ్వర్యంలో తొలుత స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, సుప్రభాతసేవ, అర్చనలు, తిరుమంజనం నిర్వహించారు. కల్యాణంలో భాగంగా విష్వక్సేనపూజ, పుణ్యావహచనం, మాంగళ్యపూజ, మధుపర్కసమర్పణ నిర్వహించిన అనంతరం స్వామివారి అమ్మవార్ల దివ్యకల్యాణం వైభవంగా నిర్వహించారు. 200మంది దంపతులు స్వామివారి కల్యాణలో పాల్గొని తీర్థప్రసాదాలుస్వీకరించారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు. అంగర శోభనాద్రి, లక్ష్మీనారాయణాచార్యులు, భక్త సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠ

ముమ్మిడివరం, ఫిబ్రవరి 19: అయినాపురంలో శ్రీఉమాసోమేశ్వరస్వామి ఆలయంలో నూతనంగా నిర్మించిన శివలింగం, ధ్వజస్తంభ పరివార దేవతా విగ్రహ పునఃప్రతిష్ఠా కార్యక్రమం సోమవారం వైభవంగా సాగింది. వేదపండితులు పుల్లేటికుర్తి సత్యనారాయణశాస్త్రి బ్రహ్మత్వంలో సోమవారం ఉదయం 10.30గంటలకు ప్రతిష్ఠాపనా మహోత్సవం జరిగింది. అధికసంఖ్యలో భక్తులు తరలివచ్చి పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యేలు దాట్ల బుచ్చిబాబు, చెల్లి వివేకానంద, నాయకులు గుత్తుల సాయి, మోకా రామారావు, దేవస్థానం చైర్మన్లు దువ్వూరి శ్రీనివాస్, ఇసుకపట్ల శివకుమార్ పాల్గొన్నారు. భారీ అన్నసమారాధన నిర్వహించారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం

అంబాజీపేట, ఫిబ్రవరి 19: పుల్లేటికుర్రులో ఉన్న శ్రీభూసమేత శ్రీ వేంకటేశ్వరస్వామి కల్యాణం సోమవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త బచ్చుగుప్త ఆధ్వర్యంలో అర్చకులు పాణింగపల్లి వెంకటాచార్యులు స్వామివారి దివ్యకల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. స్వామివారికల్యాణాన్ని అధిక సంఖ్యలో భక్తులు వీక్షించారు.

వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

కపిలేశ్వరపురం, ఫిబ్రవరి 19: అంగరలో ఉన్న శ్రీఅలివేలు మంగ, గోదాదేవ సమేత శ్రీవైభవ వెంకటేశ్వరస్వామి వారి నవమ బ్రహ్మోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. చలమచర్ల మురళీకృష్ణమాచార్యులు పర్యవేక్షణలో ఆలయ ప్రధాన అర్చకులు కె.బాలబాలాజీ ఆచార్యులు ఆధ్వర్యంలో శ్రీకరి శ్రీనివాస పవన్‌కుమార్ ఆచార్య బ్రహ్మత్వంలో కల్యాణమూర్తులకు తిరుమంజనసేవ, విశేషార్చనలు, విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచనం తదితర పూజలు వేదమంత్రోచ్చారణల నడుమ శాస్త్రోక్తంగా జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు, మహిళలు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కూటమి అధికారంలోకి రాగానే.. వైసీపీ ఫ్యాన్లు పెంటకుప్ప మీదకే

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 19: రాష్ట్రంలో టీడీపీ-జనసేన కూటమి అధికారంలోకి రాగానే విద్యుత్ బిల్లుల విధానాన్ని సరి చేయగానే ఇళ్లల్లో ఉన్న ఫ్యాన్లు పెంట మీదకు వెళతాయని ఏసీలు ఇంట్లోకి వస్తాయని టీడీపీ అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి అయితాబత్తుల ఆనందరావు పేర్కొన్నారు. సామాన్యుడి రథమైన సైకిల్‌ను అవమానిస్తావా అని జగన్‌పై మండిపడ్డారు. ఉదయం నుంచి రాత్రి వరకు చేతిలో గ్లాసు లేకుండా మనిషి జీవించగలడా అని ప్రశ్నించారు. రాష్ట్రాన్ని పిశాచిలా పట్టుకుని జగన్మోహిని పిశాచిగా పీడిస్తున్నారని ఎద్దేవా చేశారు. జగన్ చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ సోమవారం అమలాపురంలో జరిగిన కార్యక్రమంలో ఆనందరావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాను రెక్కలు విరిచేయడానికి రాష్ట్ర ప్రజలు కసితో సిద్ధంగా ఉన్నారని గుర్తుచేశారు. ఎవరిది అభివృద్ధి పాలనో, ఎవరిది విధ్వంస పాలనో ఇప్పటికే ప్రజలు గుర్తించారని, దమ్ముంటే వైసీపీ నాయకులు బహిరంగ చర్చకు రావాలని డిమాండ్ చేశారు. టీడీపీ, జనసేన గుర్తుల ప్రాముఖ్యతను వివరిస్తూ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం పట్టణ పరిధిలోని 6,7 వార్డుల్లో బాబుష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ ఎన్నికల శంఖారావం యాత్రను ఆనందరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. చంద్రబాబు సూపర్-6 పథకాలను వివరిస్తూ ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, రాష్ట్ర కార్యదర్శి పెచ్చెట్టి చంద్రమౌళి, తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు పెచ్చెట్టి విజయలక్ష్మి, నాయకులు మట్టా మహాలక్ష్మి ప్రభాకర్, అధికారి బాబ్జి, జంగా అబ్బాయివెంకన్న, చిక్కాల గణేష్, తిక్కిరెడ్డి నేతాజీ, బొర్రా ఈశ్వరరావు, బత్తుల ప్రసాద్, పెద్దిరెడ్డి రాము, భాస్కర్ల రామకృష్ణ, గంపల దుర్గాప్రసాద్, కాశిన జయనాథ్, అబ్బిరెడ్డి చంటి, వలవల శివరావు తదితరులు పాల్గొన్నారు.


అమలాపురంలో ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే ఆనందరావు తదితరులు

ఘనంగా కొండాలమ్మ జాతర

మామిడికుదురు, ఫిబ్రవరి 19: పాశర్లపూడి గ్రామదేవత కొండాలమ్మవారి జాతరను భక్తులు సోమవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. జాతర యావత్తు, డప్పు వాయిద్యాలు, చిత్రవిచిత్ర వేషధారణలు, గరగ నృత్యాలతో జరిగింది. అమ్మవారి ఆలయాన్ని వివిధ రకాల పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఏడు రోజుల పాటు జాతరను పురస్కరించుకుని పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామని, ఆదివారం జరిగే అన్నసమారాధనలో ఈఉత్సవాలు ముగుస్తాయి.

అక్షరాభ్యాసాలతో ఆలయం కిటకిట

అయినవిల్లి, ఫిబ్రవరి 19: అయినవిల్లి శ్రీసిద్ధివినాయక ఆలయం సామూహిక అక్షరాభ్యాసాలతో కిటకిటలాడింది. మాఘ శుద్ధ దశమి సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు శ్రీసిద్ధివినాయకుని దర్శించుకుని పూజలు నిర్వహించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ సిబ్బంది సేవలు అందించారు. కార్యక్రమంలో కార్యనిర్వహణాధికారి ముదునూరి సత్యనారాయణరాజు, దేవస్థానం చైర్మన్ గుత్తుల నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

వేధింపులు తగవు

మండపేట, ఫిబ్రవరి 19: ఉద్యోగులపై పోస్టల్ శాఖ లక్ష్యాలను విధించి వేధింపులకు గురిచేస్తున్న వైఖరిని తపాల ఉద్యోగులు ఖండించారు. సంఘ ఉపాధ్యక్షుడు బి.వీరయ్య చౌదరి అధ్యక్షతన రామచంద్రపురం డివిజన్ పోస్టల్ ఉద్యోగుల సమావేశం సోమవారం మండపేటలో జరిగింది. పోస్టల్ ఉద్యోగులు సమస్యలపై నేతలు మునేశ్వరరావు, కామేశ్వ రిలు మాట్లాడారు. పిల్లా నాగేశ్వరరావు, సత్యనారాయణ స్వామి, పి.ప్రసాద్, రామకృష్ణచౌదరి, సత్యనారాయణమూర్తి, రామబ్రహ్మం, ఎం.విజయ్, పోస్టల్ ఉద్యోగులు పాల్గొన్నారు.

చంద్రబాబును విమర్శించే హక్కు జగన్‌కు లేదు

పి.గన్నవరం, ఫిబ్రవరి 19: ఏపీని అన్ని విధాలా అభివృద్ధి చేసిన ఘనత టీడీపీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబుకే దక్కుతుందని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డొక్కా నాథ్ బాబు అన్నారు. అభివృద్ధి ప్రదాత చంద్రబాబును విమర్శించే నైతిక హక్కు జగన్‌కు లేదన్నారు. ఆంధ్రజ్యోతి ఫోటో గ్రాఫర్‌పై దాడి హేయమైన చర్య అని, వైసీపీ చేస్తున్న ప్రతి దాడిని రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారని, టీడీపీ మండల అధ్యక్షుడు తోలేటి సత్తిబాబు, అరుమిల్లి లాల్‌బాబు, సంసాని పెద్దిరాజు, పెదపూడి రాము, బొరుసు చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై దాడిచేసిన వారిని అరెస్టు చేయాలి

మండపేట, ఫిబ్రవరి 19: అనంతపురం జిల్లా రాప్తాడులో జరిగిన సిద్ధం సభలో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ కృష్ణపై వైసీపీ శ్రేణులు దాడికి పాల్పడడాన్ని మండపేట ప్రెస్‌క్లబ్ తీవ్రంగా ఖండించింది. దాడికి పాల్పడినవారిని అరెస్టు చేయాలని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరుతూసోమవారం ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో డిప్యూటీ తహసీల్దార్ పద్మకు వినతిపత్రం అందజేశారు. జర్నలిస్టు సంఘ నాయకులు రెడ్డి ఒమేష్, యార్లగడ్డ ప్రసాద్(టీవీ5), నూకరాజు, పాత్రికేయులు, జి.గోపి, మల్లేశ్వర రావు, లక్ష్మీనారాయణరాజు, విక్రమ్‌రావు, సత్యనారాయణ, బాబి, రాజ్‌కిరణ్, రమేష్, అర్జునరావు, ఐ.వెంకట్, సూరిబాబు పాల్గొన్నారు.


మండపేటలో డిప్యూటీ తహశీల్దార్ వినతిపత్రం అందజేస్తున్న పాత్రికేయులు

ఫొటోగ్రాఫర్‌పై దాడిని ఖండించిన ఎమ్మెల్యే

సీఎం జగన్ సాక్షిగా ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ కృష్ణపై వైసీపీ శ్రేణులు దాడిచేయటం దుర్మార్గమైన చర్యని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. రాష్ట్రంలో సామాన్యులకే కాదు పాత్రికేయులకు రక్షణ లేకుండా పోయిందన్నారు. రామకృష్ణపై జరిగిన దాడిని ఆయన ఖండించారు దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి వేగుళ్ల లీలాకృష్ణ, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కామన ప్రభాకరరావు, సీఐటీయూ నాయకురాలు కె.కృష్ణవేణి దాడిని ఖండించారు.

అంబాజీపేట: రాప్తాడులో శనివారం వైసీపీ ఆధ్వర్యంలో జరిగిన సిద్ధం బహిరంగ సభలో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ కృష్ణపై వైసీపీ శ్రేణులు దాడి చేయడం అత్యంత దారుణమని ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కోశాధికారి మట్టపర్తి శ్రీనివాస్ అన్నారు. ఫోటోగ్రాఫర్ దాడిని ఆయన తీవ్రంగా ఖండించారు. పత్రికా స్వేచ్ఛకు రక్షణ లేకుండా పోయిందన్నారు. పాత్రికేయులు హక్కులను హరిస్తూ రాజకీయ దాడులు కొనసాగుతున్నాయన్నారు. అలాగే అంబాజీపేట ది అంబాజీపేట జర్నలిస్టు అసోసియేషన్ ఆధ్వర్యంలో ఫొటోగ్రాఫర్‌పై దాడిని ఖండించారు.

రాజోలు: సిద్ధం బహిరంగ సభలో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ కృష్ణపై వైసీపీ మూకలు దాడి చేయడం దారుణమని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు అన్నారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యం లేదని, రాజ్యాంగ వ్యతిరేకంగా ప్రభుత్వం నడుస్తోందని తీవ్రంగా విమర్శించారు. దాడికి కారణమైన వారిపై తక్షణమే చర్య తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండు చేశారు.

అల్లవరం: అనంతపురం జిల్లా రాప్తాడు వద్ద శనివారం జరిగిన వైసీపీ నిర్వహించిన సిద్ధం బహిరంగ సభలో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ కృష్ణపై దాడి అమానుషమని టీడీపీ నాయకులు పోతుల సుభాష్‌చంద్రబోస్, పోతుల నరసింహారావు అన్నారు. భవిష్యత్‌లో ఇటువంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

ఆత్రేయపురం: అనంతపురం జిల్లా రాప్తాడులో నిర్వహించిన సిద్ధం బహిరంగ సభలో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ కృష్ణపై వైసీపీ నాయకులు దాడి చేయడం అత్యంత దుర్మార్గపు చర్యని బీజేపీ రాష్ట్ర యువమోర్చా కార్యదర్శి కాలాబత్తుల చిన్నారి అన్నారు. ఆత్రేయపురంలో సోమవారం ఆమె ఈసంఘటనను తీవ్రంగా ఖండించారు. ఫొటో జర్నలిస్టుపై దాడికి పాల్పడటం తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. బాధ్యులపై తక్షణమే కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

ఎస్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా శివప్రసాద్

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 19: ఎస్టీయూ 77వ జిల్లా కౌన్సిల్ సమావేశంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం పట్టణానికి చెందిన నాగిరెడ్డి శివప్రసాద్‌ను రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎస్టీయూలో 2014నుంచి2019వరకు జిల్లాలో పలు హోదాల్లో విశేష సేవలు అందించిన శివప్రసాద్‌కు రాష్ట్ర కార్యనిర్వాహక వర్గంలో సముచిత స్థానం కల్పించిన ట్లు జిల్లాశాఖ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు పోతంశెట్టి దొరబాబు, సరిదే సత్యపల్లంరాజు పేర్కొన్నారు. పి.గన్నవరం ఎస్టీయూ నాయకుడు చొప్పల రాంబాబును రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నుకున్నారు.రాష్ట్ర కార్యవర్గంలో చోటు దక్కించుకున్న శివప్రసాద్, రాంబాబులను సీనియర్ నాయకులు ఎస్వీ నాయుడు, కేకేవీ నాయుడు, జె.ఏసురాజు, పి.రాజగోపాల్, నేరేడుమిల్లి సత్యనారాయణఅభినందించారు.

రాష్ట్రాభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యం

కపిలేశ్వరపురం, ఫిబ్రవరి 19: రాష్ట్రాభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమవుతుందని ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు అన్నారు. టేకిలో సోమవారం నిర్వహించిన బాబుష్యూరిటీ, భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వ పాలనలో అన్ని వ్యవస్థలు నిర్వీర్యం అయ్యాయన్నారు. గ్రామంలో పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింట పర్యటించిన ఆయనకు అడుగడుగునా మహిళలు హారతులిచ్చి స్వాగతం పలికారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

వద్దిపర్రులో క్రైస్తవ చర్చి దగ్ధం.. క్రైస్తవ సంఘాల ధర్నా


ఆత్రేయపురం: ధర్నా చేస్తున్న దృశ్యం

ఆత్రేయపురం, ఫిబ్రవరి19: వద్దిపర్రురేవుసెంటర్‌లో బైబిల్ మిషన్ జెతన్య స్వస్థతశాల దగ్ధమవడం ఉద్రిక్తతకు దారితీసింది. పాస్టర్ దాసరి మోషే ఆధ్వర్యంలో చర్చిను నిర్వహిస్తున్నారు. సోమవారం తెల్లవారుజామున 3గంటల సమయంలో చర్చి పూర్తిగా దగ్ధమైంది. పాస్టర్ మోసే ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. ఈ ప్రమాదానికి కారణాలు తెలియాల్సి ఉంది.

క్రైస్తవ సంఘాల ఆందోళన

బైబిల్‌మిషన్ దగ్ధమైన సంఘటనపై క్రైస్తవ సంఘాలు ఆందోళన నిర్వహించాయి. చర్చి వద్ద ఆర్అండ్‌బీ రహదారిపై ధర్నా నిర్వహించారు. మత ప్రార్థన మందిరంలోకి గుర్తుతెలియని వ్యక్తులు ప్రవేశించి విలువైనవస్తు సామగ్రి ధ్వంసం చేసి నిప్పుపెట్టారని ఆరోపించారు.దుండగులను గుర్తించి తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్‌చేశారు. చర్చి విధ్వంసానికి పాల్పడిన వారిపై చర్యలు చేపట్టాలని సమాచార శాఖ మాజీ జాయింట్ డైరెక్టర్ ఎస్.ఫ్రాన్సిస్‌కలెక్టర్, ఎస్పీలను కోరారు.

కఠిన చర్యలు తీసుకోవాలి

కొత్తపేట, ఫిబ్రవరి 19: వద్దిపర్రులో గుర్తుతెలియని దుండగులు క్రైస్తవ ప్రార్థనా మందిరాన్ని దగ్ధం చేయడం నీచమైన చర్యని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని నియోజకవర్గ క్రైస్తవ జేఏసీ అధ్యక్షుడు ఎస్.డేవిడ్‌రాజు, కార్యదర్శి అడపా ప్రసాద్ అన్నారు. ఇటువంటి దారుణమైన చర్యలకు పాల్పడటంపై విచారం వ్యక్తం చేశారు. చర్చి పాస్టర్ మోషేకు జేఏసీ తరపున అండగా ఉంటామన్నారు.

రాష్ట్రంలో ఆర్థిక అనిశ్చితికి జగనే కారణం

రామచంద్రపురం, ఫిబ్రవరి 19: సీఎంగాఒక ఆర్థిక నేరగాడు వచ్చి వ్యవస్థలను నాశనం చేసి రాష్ట్రంలో ఆర్థిక అనిశ్చితి ఏర్పడేలా చేశాడని, రాజకీయంగా జగన్‌కు చివరి చాన్స్ అని టీడీపీ రామచంద్రపురం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ రెడ్డి సుబ్రహ్మణ్యం ధ్వజమెత్తారు. వైసీపీ ప్రభుత్వాన్ని, సీఎం జగన్‌ను బంగాళాఖాతంలో కలపడానికి ప్రజలు సంసిద్ధంగా ఉన్నారని ఎద్దేవా చేశారు.

వివేకానంద విద్యార్థుల ప్రతిభ

మలికిపురం, ఫిబ్రవరి 19: సైన్స్ ఒలింపియాడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గత నెలలో నిర్వహించిన ఒలింపియాడ్ పరీక్షలో విశ్వేశ్వరాయపురం వివేకానంద పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. విద్యార్థులకుపతకాలు అందజేశారు.

గజమాలయాత్రకు తరలివెళ్లిన అగ్నికులక్షత్రియులు

పి.గన్నవరం, ఫిబ్రవరి 19: అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఉత్సవాలు సందర్భంగా ఆలయ నిర్మాత కొపనాతి కృష్ణమ్మకు నిర్వహించే గజమాల యాత్రకు పి.గన్నవరంనుంచి అగ్నికులక్షత్రియ సంఘ నాయకులు, యువత అధికసంఖ్యలో బయలుదేరి వెళ్లారు. పి.గన్నవరం అక్విడెక్టు వద్ద గల కొపనాతి కృష్ణమ్మ, పెమ్మాడి సుబ్బరాజు విగ్రహాలకు నియోజకవర్గ సంఘ అధ్యక్షుడు శేరు శ్రీనుబాబు, పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బైక్‌ర్యాలీగా బయలుదేరి వెళ్లారు. సంఘ కార్యదర్శి పెమ్మాడి మారుతికృష్ణమోహన్, కొల్లు రాంబాబు, అర్థాని ఏడుకొండలు, కె.వెంకట్రావు, పొన్నమండ రాముడు పాల్గొన్నారు.

భీమేశ్వరస్వామికి పట్టువస్త్రాల సమర్పణ

ద్రాక్షారామ, ఫిబ్రవరి 19: మంగళవారం జరగనున్న ద్రాక్షారామ భీమేశ్వరస్వామివారి కల్యాణ మహోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ముందుగా ఆలయంలో మంగళవాయిద్యాలతో పట్టువస్త్రాలను ఆలయంలోకి తీసుకువచ్చారు. స్వామివారిని దర్శించుకుని అనంతరం పట్టువస్త్రాలను స్వామివారికి సమర్పించారు. అర్చకులు, ఈవో పి.టి.వి.సత్యనారాయణకు పట్టువస్త్రాలు అందజేశారు.ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

బ్లడ్‌క్యాన్సర్‌తో బాధపడుతున్న విద్యార్థికి సాయం

ద్రాక్షారామ, ఫిబ్రవరి 19: వెల్లజడ్పీ ఉన్నత పాఠశాల 8వ తరగతి విద్యార్థి అల్లం నిరంజన్‌కుమార్ బ్లడ్‌క్యాన్సర్‌తో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. వారి ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రం కావడంతో వెల్ల జడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు రూ.50వేలు, విద్యార్థులు, గ్రామస్థులు,ఇతరసంస్థల సహకారంతో రూ.65వేలు మొత్తం రూ.1.15 లక్షలు విద్యార్థి పెదనాన్న, చిన్నాన్నలకు ఉపాధ్యాయులు, విద్యార్థులు అందించారు.

నేడు వేణుగోపాలస్వామి దివ్యకల్యాణం

కొత్తపేట, ఫిబ్రవరి 19: మందపల్లి మందేశ్వర (శనేశ్వర) స్వామి క్షేత్ర పాలకులుశ్రీవేణుగోపాలస్వామివారి దివ్యకల్యాణం మంగళవారం వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ సహాయ కమిషనర్ కె.విజయలక్ష్మి తెలిపారు. మంగళవారం నుంచి శనివారం వరకు కల్యాణ మహోత్సవాలు నిర్వహిస్తామన్నారు. 20న స్వామివారి దివ్య కల్యాణం, 24న చక్రస్నానం, 25న పుష్పోత్సవం నిర్వహిస్తామని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

విగ్రహాల ఏర్పాటుపై కలెక్టర్‌కు ఫిర్యాదు

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 19: అమలాపురంలో విగ్రహాల ఏర్పాటు తీరుపై దళిత సంఘాల జేఏసీ జిల్లాశాఖ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ హిమాన్షు శుక్లాకు ఫిర్యాదు చేశారు. హైస్కూలు సెంటర్‌లో శెట్టిబలిజ సంఘ వ్యవస్థాపకుడు దొమ్మేటి వెంకటరెడ్డి, మాజీ ఎమ్మెల్యే కుడుపూడి చిట్టబ్బాయి విగ్రహాలు ప్రభుత్వ అనుమతులు లేకుండా ఏర్పాటు చేయడాన్ని వివరిస్తూ కలెక్టర్‌కు లేఖ అందజేశారు. తగు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చినట్టు దళిత జేఏసీ నాయకుడు బొంతు రమణ తెలిపారు. నాయకులు గిడ్ల వెంకటేశ్వరరావు, రేవు తిరుపతిరావు, మెండి డేవిడ్‌అంబేడ్కర్, మోకా శ్రీను, దుక్కిపాటి సత్యనారాయణ, గూటం సాయిపాల్గొన్నారు.

అన్ని వర్గాలను ఆదుకునేందుకు సూపర్‌సిక్స్ పథకాలు

రావులపాలెం, ఫిబ్రవరి 19: వైసీపీ ఆరాచక పాలనలో నష్టపోయిన అన్ని వర్గాల ప్రజలను ఆదుకునేందుకే టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు సూపర్‌సిక్స్ పథకాలనుతీసుకువచ్చారని మాజీ ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. ఊబలంకలో సోమవారం బాబుష్యూరిటీ..భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ పర్యటిస్తూ సూపర్‌సిక్స్ పథకాల ద్వారా ప్రజలకు కలిగేమేలుపై వివరించారు.

డిమాండ్లు పరిష్కరించాలి

ముమ్మిడివరం, ఫిబ్రవరి 19: జీతం నెలకు రూ.15వేలు పెంచాలని డిమాండు చేస్తూ జిల్లా ప్రభుత్వ పాఠశాలల కార్మికుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బొడ్డపల్లి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల మధ్యాహ్న భోజన పథక కార్మికులు ర్యాలీగా వెళ్లి సోమవారం ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రావిడెంట్ ఫండ్ ఏర్పాటు చేయాలని, ప్రమాద బీమా పథకం వర్తింప చేయాలని, గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. దీనిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి డిమాండ్లను సీఎం జగన్ దృష్టికి తీసుకువెళతానన్నారు. జిల్లాలోని వివిధ సంఘాల నాయకులు ఆకుల వెంకటలక్ష్మి, నల్లి సుమతి, చెదలాడ భవానీ, ఖండవల్లి విజయలక్ష్మి, సూదా సుందరం, అడబాల సరస్వతి, ఎన్.గంగాభవానీ పాల్గొన్నారు.

మంజీరా స్పెషాలిటీ ఆసుపత్రి ప్రారంభం

ముమ్మిడివరం, ఫిబ్రవరి 19: ముమ్మిడివరంలో టెక్నాలజీతో నూతనంగా ఏర్పాటుచేసిన సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని మంత్రి పినిపే విశ్వరూప్ సోమవారం ప్రారంభించారు. ఆసుపత్రిలో గ్యాస్ట్రిక్ కేన్సర్ లివర్ ట్రాన్స్‌మిషన్ సర్జరీ విభాగాలను ఎంపీ చింతా అనురాధ ప్రారంభించారు. ఆసుపత్రి వైద్యులు డాక్టర్ సుధీర్, డాక్టర్ మంజీరా దంపతులను అభినందించారు. ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్, ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు, కలెక్టర్ హిమాన్షు శుక్లా, మాజీ ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు, నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్, హితకారిణి సాసమాజ్ చైర్మన్ కాశి బాలమునికుమారి పాల్గొన్నారు.

ఘనంగా వీరభద్రస్వామి విగ్రహాల ప్రతిష్ఠ


మామిడికుదురు, ఫిబ్రవరి 19: పాశర్లపూడి ఉత్తర బాడవలో నూతనంగా నిర్మించిన ఆలయంలో భద్రకాళీ సమేత వీరభద్రస్వామి విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమం సోమవారం ఘనంగా జరిగింది. గ్రామానికి చెందిన పలువురు భక్త దంపతులు ప్రధాన కర్తలుగా పాల్గొని ప్రతిష్ఠా కార్యక్రమాన్ని నిర్వహించారు. లూటుకుర్రులో నూతనంగా నిర్మించిన ఆలయంలో ధనమ్మ విగ్రహ పునఃప్రతిష్ఠ జరిగింది. పెదపట్నంలంక గ్రామంలో శ్రీభద్రకాళీ సమేత బాల వీరభద్రేశ్వరస్వామి ఆలయం వద్ద వీరభద్రస్వామి ఆలయం వైభవంగా జరిగింది.

అనుచిత వ్యాఖ్యలు తగవు

కాట్రేనికోన, ఫిబ్రవరి 19: మత్స్యకారజాతిపైన, మాజీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబుపైన కాకినాడ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి చేసిన వ్యాఖ్యలను టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, కాకినాడ నియోజకవర్గ టీడీపీ పరిశీలకుడు నాగిడి నాగేశ్వరరావు ఖండించారు. మత్స్యకారుల మనోభావాలు దెబ్బతినే విధంగా ద్వారంపూడి మాట్లాడటం సరికాదన్నారు. రాబోయే ఎన్నికల్లో మత్స్యకారుల సత్తా ఏమిటో చూపించి తగిన గుణపాఠం చెబుతామని నాగిడి అన్నారు.

ఘనంగా బెతెస్థ ప్రార్థనా మందిరం వార్షికోత్సవం

మండపేట, ఫిబ్రవరి 19: స్థానిక ప్రభుత్వాసుపత్రి వెనుక ఉన్న బెతెస్థ ప్రార్థనా మందిరం 27వ వార్షికోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. సంఘ కాపరి బిషప్, రెవ. చిలుకూరి ఉదయభాస్కర్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం సంఘీయులకు విందు ఏర్పాటు చేశారు.


సందేశం ఇస్తున్న ఉదయభాస్కర్

జనరేటర్ బహూకరణ

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 19: అమలాపురంలోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానానికి ఎ.వేమవరానికి చెందిన ప్రముఖులు సోమవారం రూ.12లక్షల విలువైన 125కేవీ జనరేటర్‌ను బహూకరించారు. సత్యనారాయణ టెంట్‌హౌస్ గ్రూపునకు చెందిన రాకుర్తి నారాయణ-మాణిక్యం దంపతుల పేరిట రాకుర్తి సత్యనారాయణ కుటుంబ సభ్యులతో పాటు మద్దింశెట్టి నాగేశ్వరరావు పేరిట వెంకటసత్యనారాయణలు జనరేటర్‌ను చైర్‌పర్సన్ విరీతాదేవికి అందజేశారు.

షిర్డిసాయి ఆలయ కమిటీ అధ్యక్షుడిగా చల్లా



ఆలమూరు, ఫిబ్రవరి 19: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోనే ప్రప్రథమ ఆలయంగా పేరుగాంచిన ఆలమూరు శ్రీషిర్డీ సాయిబాబా ఆలయ నూతన పాలకవర్గం సోమవారం ప్రమాణ స్వీకారం చేసింది. ఆలయ కమిటీ నూతన గౌరవాధ్యక్షునిగా వంటిపల్లి పాపారావు, అధ్యక్షుడిగా చల్లా ప్రభాకరరావు, ఉపాధ్యక్షుడిగా కాలా అప్పారావు, కార్యదర్శిగా కొమ్మిశెట్టి లక్ష్మణరావు, సహాయ కార్యదర్శిగా చిలకమర్తి వాసుదేవరావు, కోశాధికారిగా నార్కేడిమిల్లి వెంకన్నబాబులతో పాటు పలువురు సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఆలయంలో బాబా విగ్రహానికి వెండి మకరతోరణం తయారీకి రూ.3.5లక్షల విరాళం అందిస్తున్నట్లు గౌరవాధ్యక్షుడు వంటిపల్లి పాపారావు ప్రకటించారు. నూతన పాలకవర్గాన్ని పలువురు అభినందించారు.

శివరాత్రి ఉత్సవాలకు రాట పూజలు

రాయవరం, ఫిబ్రవరి 19: బాలాత్రిపుర సుందరి సమేత సోమేశ్వర స్వామి ఆలయంలో వచ్చేనెల 8నుంచి జరిగే శివరాత్రి ఉత్సవాలకు సోమవారం రాట మంచి పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ గరగ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో వర్తక సంఘం సభ్యులు వినాయకపూజ, స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, వర్తక సంఘం సభ్యులు పాల్గొన్నారు.

పుదుచ్చేరి కలెక్టర్‌ను కలిసిన ఆర్‌ఏ

యానాం, ఫిబ్రవరి 19: యానాం పరిపాలనాధికారి మునిస్వామి సోమవారం పుదుచ్చేరి నూతన కలెక్టర్ కోలుతుగన్‌ను పుదుచ్చేరి మర్యాదపూర్వకంగా కలిసారు. అనంతరం ఆయన ఎన్నికలు సంబంధించిన పలు సమావేశాల్లో పాల్గొన్నారు. మంగళవారం ఉదయానికి యానాం చేరుకుంటారు.

యానాం క్రీడాకారుడికి బంగారు పతకం

యానాం, ఫిబ్రవరి19:రాజమహేంద్రవరం ఆర్ఎంసీ స్టేడియంలో ఈనెల 16నుంచి 18వరకు జరిగిన రాష్ట్రస్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో యానాం క్రీడాకారుడు పట్టా రామకృష్ణ బంగారు పతకం సాధించాడు. డబుల్స్ 40ఏళ్లపైబడి విభాగంలో తూర్పుగోదావరి జిల్లా క్రీడాకారుడు రామ్మోహన్‌రావుతో కలిసి ఆడిన రామకృష్ణలు విజేతలు నిలిచి బంగారు పతకాలు సాధించారు. రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, విజయనగరం ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు బంగారు పతకం, స్టేట్ రిజిస్టర్ సర్టిఫికెట్లను అందజేశారు. రన్నర్లగా గుంటూరు జట్టు సభ్యులు సతీష్, రాము నిలిచారు.

దొమ్మేటి వెంకటరెడ్డి విగ్రహావిష్కరణ



అమలాపురం టౌన్, ఫిబ్రవరి 19: అమలాపురం హైస్కూల్ సెంటర్‌లో శెట్టిబలిజ జాతిపిత దొమ్మేటి వెంకటరెడ్డి విగ్రహాన్ని సోమవారం మంత్రి పినిపే విశ్వరూప్ ఆవిష్కరించారు. ఎమ్మెల్సీలు కుడుపూడి సూర్యనారాయణరావు, బొమ్మి ఇజ్రాయిల్, పినిపే శ్రీకాంత్, యిళ్ల శేషగిరిరావు, సంసాని బులినాని, చెల్లుబోయిన శ్రీనివాస్, కుడుపూడి బాబు, కుడుపూడి భరత్‌భూషణ్ తదితరులు పాల్గొన్నారు.

ద్వారంపూడి క్షమాపణలు చెప్పాలి

పి.గన్నవరం, ఫిబ్రవరి 19: జాతిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి క్షమాపణ చెప్పాలని కోరుతూ అగ్నికులక్షత్రియ నాయకులు పార్టీలకు అతీతంగా పి.గన్నవరంలో నిరసన చేపట్టారు. వ్యాఖ్యలు వెనక్కి తీసుకుని, బేషరతుగా క్షమాపణలు చెప్పాలని నియోజకవర్గ అగ్నికుల క్షత్రియ సంఘ అధ్యక్షులు శేరు శ్రీనుబాబు డిమాండ్ చేశారు. నిరసనలో అగ్నికులక్షత్రియ సంఘ కార్యదర్శి పెమ్మాడి మారుతి కృష్ణమోహన్, మండల అధ్యక్షుడు కొల్లు రాంబాబు, అంకాని సత్తిబాబు, అర్థాని ఏడుకొండలు, కొల్లాటి వెంకట్రావు, పొన్నమండ రాముడు, లంకే చిరంజీవి, మాల్లాడి గోపి, కె. రామకృష్ణ, ఎస్.సత్యనారాయణ, ఓలేటి పుత్రయ్య, సంఘ నాయకులు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యంపై కేసు నమోదు

ఆత్రేయపురం, ఫిబ్రవరి 19: బాలిక అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. ఉచ్చిలి గ్రామానికి చెందిన 13 ఏళ్ల బాలిక 6వతరగతి చదువుతోంది. ఈనెల18న ఇంటి నుంచి వెళ్లి తిరిగిరాలేదు. ఆమె తల్లి లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఇళ్ల పట్టాలను రద్దు చేయండి

కాట్రేనికోన, ఫిబ్రవరి 19: గతంలో చెయ్యేరులో 280మందికి ఇళ్ల పట్టాలిచ్చి, కొంత భూమిని కమ్యూనిటీ హాలు, అంగన్‌వాడీ భవనం, ఇతర నిర్మాణాల కోసం మినహాయించగా ఇప్పుడు ఆ స్థలాన్ని మరికొందరికి ఇళ్ల స్థలాలుగా కేటాయించడంపై న్యూకాలనీ వాసులు అభ్యంతరం వ్యక్తంచేస్తున్నారు. దీనిపై సోమవారం స్పందనలో ఫిర్యాదు చేశారు. పంచాయతీ చెరువును ఇళ్ల స్థలాలుగా ఇవ్వడాన్ని వ్యతిరేకించారు. కొత్తగా మంజూరు చేసిన ఇళ్ల పట్టాలను రద్దు చేసి, వేరే ప్రాంతంలో వారికి స్థలం కేటాయించాలని కోరారు. ఐ.రాజశేఖర్, యు.కన్నబాబు, ఎం.పావని తదితరులు ఫిర్యాదు చేసిన వారిలో ఉన్నారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన తహసీల్దారు

అంబాజీపేట, ఫిబ్రవరి 19: మొసలపల్లి, వక్కలంక, ఇరుసుమండ గ్రామాల్లో ఉన్న పోలింగ్ కేంద్రాలను తహసీల్దారు జె.విమలకుమారి పరిశీలించారు. ఆయా కేంద్రాలో విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్లు, దివ్యాంగులకు వెళ్లేందుకు ర్యాంపులు ఏర్పాటు చేయాలని సూచించారు.

బీసీ యువకులు టీడీపీలో చేరిక

ఆలమూరు, ఫిబ్రవరి 19 పెనికేరులో పలువురు బీసీ యువకులు మాజీ ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఆధ్వర్యంలో టీడీపీలో చేశారు. పెనికేరులో జరిగిన కార్యక్రమంలో గ్రామ టీడీపీ ఆధ్వర్యంలో బీసీ నాయకులు గుడాల ప్రభాకర్, గుత్తుల సూరిబాబు సమక్షంలో బీసీ యువకులు పార్టీలో చేరారు. వారికి బండారు పార్టీ కండువా వేసి ఆహ్వానించారు.

గడ్డివాము దగ్ధం

ఆలమూరు, ఫిబ్రవరి 19: చొప్పెల్లలో ఆదివారం రాత్రి గడ్డివాము దగ్ధమైంది. గ్రామానికి చెందిన రైతు సుంకర నాగేశ్వరరావు పశువుల కోసం నిల్వ చేసిన ఐదు ఎకరాల్లోని గడ్డి వాముకు అర్ధరాత్రి ఒక్కసారిగా నిప్పుఅంటుకుని మంటలు వ్యాపించాయి. రూ.80వేలువిలువైన గడ్డివాము కాలిపోయింది.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

అంబాజీపేట, ఫిబ్రవరి 19: అంబాజీపేట డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన పరిశోధన కేంద్రంలో సోమవారం కొబ్బరి వృక్షమిత్రులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉద్యాన పరిశోధన కేంద్ర అధిపతి డాక్టర్ ఎన్.బి.వి.చలపతిరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డాక్టర్ వైఎస్సార్ యూనివర్సిటీ జోనల్ రీసెర్చ్ హెడ్ కోస్టల్ జోన్-1 డాక్టర్ జి.రామానందం మాట్లాడుతూ శిక్షకులు క్లైంబింగ్ పరికరం ఉపయోగించి కొబ్బరి చెట్లు ఎక్కే నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలన్నారు.తొలిరోజు కొబ్బరిలో మేలైన రకాలు, నాణ్యమైన నారుమొక్కలు, తయారీ విధానాం, నీటి యాజమన్యాం వంటి అంశాలపై అవగాహన కల్పించారు.